ఉష్ణోగ్రత (అంచనా) 16-5-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	38	27
బాపట్ల	38	28
రెంటచింతల	38	26
చీరాల	38	28

టీడీపీలో.. మినీ కోలాహలం

- 18 నుంచి నియోజకవర్గాల్లో నిర్వహణ
- స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు
- 22, 23 తేదీల్లో ఒక రోజు జిల్లా స్థాయి మహానాడు
- తుది దశలో సంస్థాగత ఎన్నికలు.. 23 కల్లా జిల్లా అధ్యక్షుల ప్రకటన


గుంటూరులోని టీడీపీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో మహా సందడి మొదలైంది. ఒకవైపు కడపలో మహానాడు పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతుండగా.. అందుకు సన్నాహకంగా నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులకు ఎక్కడికక్కడ స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో తమ్ముళ్లలో మినీ మహానాడుల కోలాహలం నెలకొంది. ఒకవైపు మహాపండుగలా మహానాడును నిర్వహించేందుకు పార్టీ అధినాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కూడా మహానాడుల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు తరలివెళ్లేందుకు శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర మహానాడుకు సన్నద్ధతగా నియోజకవర్గాల్లో మహానాడుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర మహానాడుకు ముందుగా ఈ నెల 18 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహానాడులను నిర్వహిం చనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడుల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మినీ మహానా డులకు సంబంధించి తేదీలను కూడా ప్రకటించారు. మినీ మహానాడులలో ఆయా నియోజకవర్గాల పరిధిలో నెల కొన్న సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను చేస్తారు. వీటిని రాష్ట్ర మహానాడుకు నివేదిస్తారు. మినీ మహానాడుల అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో ఏదో ఒక రోజు జిల్లా మహానాడు నిర్వహిస్తారు. దీనికి ముందే పార్టీ జిల్లా కొత్త అధ్యక్షుడ్ని రాష్ట్ర పార్టీ నియమిస్తుంది. కొత్త అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లా మహానాడు జరుపుతారు.

మొదలైన సంస్థాగత సందడి

నియోజకవర్గాల్లో నిర్వహించే మహానాడుల కంటే ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేస్తారు. ఇప్పటికే గ్రామ, వార్డు, డివిజన్ స్థాయిలో ఈ ఎన్నికల ప్రక్రియ తుది దశలో ఉంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ కమిటీలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. రెండో దశలో ఈ నెల 18లోగా నగర, పట్టణ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల బాధ్యు ల నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి అధిష్ఠానం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పరిశీలకులను ప్రత్యేకంగా నియమించింది. ఎన్నికల్లో పార్టీ కోసం పాటు పడిన వారికి అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బూత్, క్లస్టర్ స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న వారికి పదవులు కేటాయించనున్నారు. ఆయా పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఎంపిక కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు తల నొప్పిగా మారింది.

పుర పాఠశాలలకు.. పోస్టులు


గుంటూరు : మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- అవసరమైన పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 190కిపైగా ఎస్‌ఏలు
- ఉన్నత పాఠశాలలకు ఇక పూర్తిస్థాయి హెచ్‌ఎంలు
- మున్సిపాల్టీల్లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీకి ఆమోదం

గుంటూరు (విద్య), మే 15 (ఆంధ్ర జ్యోతి): మున్సిపాల్టీల పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత కొన్నేళ్లుగా మెరుగైన ఫలితాలతో మున్సిపల్ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు పోటీ పడుతున్నాయి. అయితే ఉపాధ్యాయుల కొరతతో మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటిదాకా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులతో నెట్టుకొస్తున్న పాఠశాలలకు ఇక పూర్తిస్థాయిలో హెచ్‌ఎంలు రానున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో దాదాపు 17 ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13 మున్సిపాలిటీలు, గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 150 పైగా ఉన్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యా వలంటీర్లు లేదంటే ప్రాథమిక పాఠశాలల నుంచి ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై నియమించి విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. గుంటూరులో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా పూర్తిస్థాయి హెచ్‌ఎంలు లేరు. మరోవైపు పీఈటీల కొరత కూడా మున్సిపల్ పాఠశాలలను వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏటా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించేందుకు ఉపాధ్యాయులను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది అవసరమైన చోట ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తి స్థాయిలో నియమించుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ టూ హెచ్‌ఎం పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 9 మందికిపైగా పూర్తిస్థాయి హెచ్‌ఎంలు రానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 190కి పైగా స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులు భర్తీ కానున్నాయి. అవసరమైన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. త్వరలో షెడ్యూల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవ..

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నారా లోకేశ్ తాను ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుల కొరత గురించి స్వయంగా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల భర్తీకి ఆయన చొరవ చూపినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హైమారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దాదాపు 2000పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు మంజూరు చేశారన్నారు.

అనంతవరప్పాడులో రీ సర్వే పరిశీలన


వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో రీసర్వే గురించి వివిధ రాష్ట్రాల ప్రతినిధులకు వివరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ

31 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు

వట్టిచెరుకూరు, గుంటూరు, మే 15 (ఆంధ్ర జ్యోతి): వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో వ్యవసాయ భూములను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన రెవెన్యూ, సర్వే అధికారులు పరిశీలించారు. గ్రామంలో భూముల రీ సర్వే జరిగిన తీరుని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గుంటూరులో జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన భూ రికార్డుల డిజిటలైజేషన్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు 31 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా వారంతా అనంతవరప్పాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ భార్గవ్‌తేజ రీసర్వేపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను వివరించారు. వందేళ్ల క్రితం ఉన్న ల్యాండ్ రికార్డులను మార్చేందుకు రీ సర్వే డిజిటలైజేషన్ చేపట్టినట్లు వివరించారు. ప్రతి భూ యజమానికి హక్కుతో కూడిన పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రీసోర్స్ ఆధ్వర్యంలో ఈ సర్వేలు చేపట్టినట్లు తెలిపారు. భూములను సర్వే చేయించి క్యూ ఆర్ కోడ్‌తో పాసు బుక్ అందిస్తామని, ప్రతి గ్రామంలో తప్పనిసరిగా రీ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఆధార్ నెంబర్‌తో యూనిక్ ఐడీ ఏర్పాటు చేసి గతంలో రీ సర్వే చేయించిన విధానాన్ని మ్యాప్ ద్వారా ప్రతినిధులకు జేసీ వివరించారు. క్యూ ఆర్ కోడ్ చేసిన పాసు పుస్తకాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్లు, వీఆర్వోలు, ఈఆర్‌ఏలు, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం

ఆర్థిక స్వేచ్ఛ.. ఎప్పటికో?

- జీతాలు, బిల్లుల చెల్లింపులో జాప్యం
- మార్గదర్శకాల్లోనే మున్సిపాల్టీలకు అధికారాలు
- ఇప్పటికీ పాత పద్ధతిలోనే ఆర్థిక లావాదేవీలు
- రూపాయి ఖర్చుకు కూడా అనుమతి కోసం ఎదురుచూపు
- సీఎఫ్‌ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీల్లో ఆర్థిక వెతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు ఉన్నా.. మున్సిపాల్టీల్లో ఖర్చు చేసుకునే వెసులుబాటు లేదు. అత్యవసర పనులకు సైతం బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. ప్రజలు నుంచి ఆస్తి, నీటి, ప్రకటనల పన్నులను షాపింగ్ కాంప్లెక్సు లీజుల ద్వారా వచ్చే ఆదాయాలను మున్సిపాలిటీలు వసూలు చేస్తున్నా.. ఆ మొత్తాలపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదే. పేరుకు పురపాలక సంఘం.. ప్రత్యేక పాలనా వ్యవస్థ ఉన్నా.. ఆర్థిక స్వేచ్ఛ మాత్రం లేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఉద్యోగులకు జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించే పరిస్థితి నెలకొంది. మున్సిపాల్టీలకు అధికారాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే నెలలు గడుస్తున్నా ఈ మార్గదర్శకాలు అమల్లోకి రాలేదు. సీఎఫ్‌ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీలు ఆర్థిక వెతలను ఎదుర్కొంటున్నాయి. పంచాయతీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించింది. దీంతో ప్రజలు చెల్లించే పన్ను, వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ అజమాయిషీ లేకుండా అభివృద్ధి పనులకు వినియోగిం చుకునే అధికారం పంచాయతీలకు వచ్చింది. ఈ పరిస్థితి మున్సిపాల్టీలకు లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రతి బిల్లు అప్‌లోడ్ చేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తేనే సీఎఫ్‌ఎంఎస్‌లో ఆ బిల్లు పాసవుతుంది. ఈ ప్రక్రియ అమలులో జాప్యం జరుగుతోంది. మున్సిపాల్టీల్లో అత్యవసర పరిస్థితుల్లో తాగునీరు, పారిశుధ్య పనులు చేయాల్సి వస్తుంది. ఇందుకు సంబంధించి బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. సీఎఫ్‌ఎంఎస్ నుంచి మున్సిపాల్టీలను తప్పించేందుకు పలు ఆర్థికపరమైన అనుమతులు కావాలని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఆర్థిక పరమైన స్వేచ్ఛ కోసం మున్సిపాల్టీలు మరికొంత సమయం వేచి ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.సీఎఫ్‌ఎంఎస్ నుంచి మున్సిపాల్టీ లకు విముక్తి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని పురపాలకులు కోరుతున్నారు.


8
పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ని వీక్షిస్తున్న మంత్రులు పెమ్మసాని, అనగాని, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

అమరావతి రాజధానిని అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- డీఐఎల్ఆర్ఎంపీ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు వేళాయే 8

- నేటి నుంచి జూన్ 2వ తేదీ వరకు అవకాశం

జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18.50 కోట్ల పెట్ స్కాన్ 6

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి

6


8

మండుతూనే.. ముంచెత్తింది..!

గుంటూరు నగరంలో ఈదురుగాలులతో వర్షం

ఉదయం నుంచి ఎండ.. మధ్యాహ్నం తర్వాత వర్షం



స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరిస్తున్న అర్చకులు

వైకుంఠపురంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించి, పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నిత్య హోమం, ఆలయ బలిహరణ, శేష వాహన గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఈవో ఎం.అనుపమ, అర్చక సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.

గంజాయి కేసులో వారెంట్ ముద్దాయి అరెస్టు

తెనాలిరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతన్న వారెంట్ ముద్దాయిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన గండికోట గోపీ అలియాస్ పవన్ కల్యాణ్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో గంజాయి కేసు నమోదైంది. షరుతులతో కూడిన బెయిల్‌పై ఉన్న అతను 2023 నుండి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో మెజిస్ట్రేట్ నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఇవ్వడంతో గోపీని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. అతడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి శ్రామికుడి మృతి

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో గుండెపోటుతో ఉపాధి శ్రామికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మన్నవగ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ అలీషా (60) గురువారం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. పని ప్రదేశంలోనే అలీషాకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఏపీవో సుభాషిణీ, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక వైద్య సిబ్బంది పరీక్షించి అలీషా మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం!

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి



బ్యాంక్ చైర్మన్ కే ప్రమోద్ కుమార్ రెడ్డి

దేశంలోనే అత్యధిక లాభార్జన కలిగిన, రాష్ట్రంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరిస్తోంది. దాదాపు నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పడిన ఈ ప్రాంతీయ బ్యాంకులో గ్రామీణులు, ముఖ్యంగా నిరక్షరాస్యుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. పాస్‌బుక్, ఏటీఎం, యూపీఐతో పనిలేకుండా ఖాతాదారుని మొహాన్ని స్కాన్ చేసి, నగదు విత్ డ్రా చేసుకునే మెషిన్‌ను ఏర్పాటు చేశారు. దీనంతటి వెనుక బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి కృషి ఉంది. బ్యాంకు సాధిస్తున్న ప్రగతి, నూతన సేవలపై ఆంధ్రజ్యోతి ఆయనతో ముచ్చటించింది.

- (గుంటూరు- ఆంధ్రజ్యోతి)

● **ఆంధ్రజ్యోతి: బ్యాంకుల విలీనం ఎందుకు?**

చైర్మన్: నిన్నటి దాకా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు సేవలు అందించేవి. వాటన్నింటినీ విలీనం చేయడం ద్వారా బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందివచ్చు. అందు కోసమే విలీనం చేశాం. ఈ బ్యాంకుల విలీనం చేసి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. బ్యాంకు ప్రధానకార్యాలయం గుంటూరులోనే ఏర్పాటు చేశాం.

● **ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలోనే పెద్ద నెట్‌వర్క్ ఉన్న గ్రామీణ బ్యాంకుగా చెప్పవచ్చా?**

చైర్మన్: నాలుగు బ్యాంకుల విలీనం తర్వాత రాష్ట్రంలోని అతిపెద్ద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు నెట్‌వర్క్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరించింది. రాష్ట్ర జనాభా 5.2 కోట్లు కాగా, అందులో 23 శాతం మంది మా బ్యాంకులోనే ఖాతా కలిగి ఉన్నారు. రాష్ట్రంలో 1.27 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుతం 1,351 బ్రాంచులతో కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రాష్ట్రంలో మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా ఉన్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 167 ఏటీఎంలు ఉన్నాయి. బ్యాంకింగ్ కరెస్పాండెన్స్ విధానం ద్వారా 3,029 పాయింట్లలో ఖాతాదారులకు సేవలు అందజేస్తున్నాం.



ఫేస్ పే మిషన్..

● **ఆంధ్రజ్యోతి: సాంకేతికంగా బ్యాంకు పురోగతి ఏమిటి?**

చైర్మన్: బ్యాంకులో అందుబాటులోకి తెచ్చిన సాంకేతికత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఇప్పటి వరకు కమర్షియల్ బ్యాంకులు కూడా అందుబాటులోకి తీసుకురాని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం అందుబాటులోకి తెస్తున్నాం. బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం, ఆధార్, యూపీఐ యాప్ వేటితో సంబంధం లేకుండా ఖాతాదారుడు తనకు కావాల్సిన నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించాం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్, ఏటీఎం, యూపీఐ వినియోగంపై అంత అవగాహన ఉండదు. పైగా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లంటే ప్రజల్లో భయం ఉంటుంది. పోనీ బ్యాంకుకు వెళదామా అంటే అక్కడ పెద్ద క్యూ ఉంటుంది. అందుకని ఖాతాదారు బ్యాంకంటేనే భయపడే పరిస్థితి ఉంటుంది. అలాంటి వారు ఒట్టి చేతులతో వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకునేలా 'ఫేస్ పే' సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాం.

● **ఆంధ్రజ్యోతి: ఫేస్ పే అంటే ఏమిటీ? దాన్ని ఎలా వినియోగించుకోవాలి.**

చైర్మన్: అన్ని బ్యాంకులు ఏటీఎం, యూపీఐ వంటి సేవలు అందిస్తున్నాయి. వాటితో పాటు మనం ఫేస్ పే సదుపాయాన్ని తెచ్చాం. బ్యాంకులో నగదు విత్‌డ్రా చేసుకోవాలనుకునేవారు విత్ డ్రా ఫామ్ నింపడం, క్యూలో నిలబడటం వంటి సమస్యలను ఫేస్ పే లేకుండా చేస్తుంది. ఖాతాదారు ఫేస్ పే మిషన్ ఎదురుగా నించుంటే అది అతడి ముఖాన్ని స్కాన్ చేసుకుంటుంది. ఫొటో తీసుకుని సరిపోల్చుకుంటుంది. ఓకే అయిన తర్వాత ఖాతాదారు పేరు, పాస్‌బుక్ వివరాలు, ఖాతాలో నిల్వ మొత్తం తెలుగులో ఖాతాదారుకు వినిపిస్తుంది. విత్‌డ్రా సేవను చెబుతుంది. ఖాతాదారు తాను విత్‌డ్రా చేసుకోదల్చిన మొత్తాన్ని నమోదు చేశాక, దాన్ని కన్ఫార్మ్ చేసుకోవడానికి మరోసారి వినిపిస్తుంది. ఖాతాదారు ఓకే చేస్తే ఏటీఎంలో లాగా నగదు బయటకు వస్తుంది. నగదు లేకపోతే ఓచర్ వస్తుంది. ఆ ఓచర్ తీసుకుని బ్యాంకు సిబ్బందికి ఇస్తే వారు వెంటనే డబ్బు ఇస్తారు.

● **ఆంధ్రజ్యోతి: లిమిట్ ఎంత వరకూ?**

చైర్మన్: ప్రస్తుతం రూ. 25వేల వరకూ ఫేస్ పే ద్వారా విత్‌డ్రా చేసుకోవచ్చు. మున్ముందు మరింత పెంచుతాం. దాంతోపాటు నగదు డిపాజిట్, ఇతర సదుపాయాలన్నీ అందుబాటులోకి తీసుకువస్తాం.

● **ఆంధ్రజ్యోతి: ఎవరైనా ఖాతాదారు ఫొటో తెచ్చి మోసం చేయొచ్చు కదా?**

చైర్మన్: అలా జరిగే అవకాశమే లేదు. ఫొటోలు పెడితే మిషన్ తీసుకోదు. అలాంటి మోసాలు జరగకుండా ఉండడానికి 'లైవ్‌నెస్ డిటెక్షన్'ను అమర్చాం. సజీవమైన మనిషి ఉంటేనే మిషన్ తీసుకుంటుంది.

● **ఆంధ్రజ్యోతి: ఇలాంటివి ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?**

చైర్మన్: అన్ని చోట్లకు వీటిని అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల ఏర్పాటు చేశాం. గుంటూరు జిల్లాలో బ్రాడీపేట, మంగళగిరి, నంబూరు, యనమదలలో, పల్నాడు జిల్లాలో నరసరావుపేట, మోర్జంపాడు, కారంపూడి, పులిపాడు, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం, ఏలూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశాం. గుంటూరు బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన ఫేస్ పే మిషన్‌ను నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్. గోపాలం ప్రారంభించారు.



పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగ సంఘం నాయకులు

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి శిస్టు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు..గురువారం పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ చల్లా అనురాధను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వార్డు సచివాలయ ఉద్యోగుల ఉద్యోగోన్నతికి ఇచ్చిన జీవో నంబరు 523ను రద్దుచేయాలని కోరారు. ఉద్యోగోన్నతి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్, అంతకంటే ఎక్కువ ఉండే విధంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులకు వివిధ సంక్షేమ శాఖల్లో ఉద్యోగోన్నతులకు అవకాశం ఇవ్వాలని, రెగ్యులర్ విధానంపై మెప్మాలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా నియమించాలని, అర్హులకు కార్మిక శాఖలో అసిస్టెంట్ లేబర్ వెల్ఫేర్ అధికారులుగా అవకాశం కల్పించాలని ఇలా పలు డిమాండ్లను వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డైరెక్టర్ చల్లా అనురాధ వారికి హామీ ఇచ్చారు. సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థా మధు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి పార్థసారథి, కాకినాడ జిల్లా నాయకులు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

చిలకలూరిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ సంయుక్తంగా శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సీఆర్ క్లబ్ కళా వేదికను సిద్ధం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18.50 కోట్ల పెట్ స్కాన్

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక పెట్ స్కాన్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.18.50 కోట్లు. పలు రకాల క్యాన్సర్ వ్యాధుల చికిత్సలో, వ్యాధి నిర్ధారణలో ఈ పరికరం ఎంతో కీలకం. రాష్ట్ర ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రికి పెట్ స్కాన్‌ను అందజేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ఈ పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి చేసి మరో నెల రోజుల్లో రోగులకు అందుబాటులోకి తెస్తామని జీజీహెచ్ అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రైవేటు క్యాన్సర్ హాస్పిటల్స్‌లో పెట్ స్కాన్‌కు రూ.25 వేలు, పేదలకు కన్‌సెషన్ కింద కనిష్ఠంగా రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చారిటీ ఆసుపత్రుల్లో రూ.8 వేలకు ఈ పరీక్ష చేస్తున్నారు. జీజీహెచ్‌లో పెట్ స్కాన్ పరీక్షలు ఉచితమా? నామమాత్రపు రుసుం తీసుకుంటారా అనేదానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ స్కాన్

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00



విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేస్తున్న రాంబాబు నాయక్

పదిలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

బొల్లాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన డాక్టర్ జర్పావత్ రాంబాబు నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ పుట్టిన రోజు సందర్భంగా వినుకొండ - మాచర్ల నియోజకవర్గాల్లో ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మూడావత్ రమణానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంబాబు నాయక్ ఫౌండేషన్ చైర్మన్, సువర్ణ కుటీర డెవలపర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టి తల్లిదండ్రులను సంతోష పరచాలని సూచించారు. లక్ష్యం లేని విద్యార్థి ఏదీ సాధించలేడని, ముందు చూపు ఉన్నవాడు ముందడుగేస్తాడన్నారు. నాయక్ 40వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు రూ.5వేలు చొప్పున స్కాలర్‌షిప్స్ అందజేశారు. ఐదేళ్లుగా సేవలు అందిస్తున్న రాంబాబు నాయక్‌ను పలువురు ఈ సందర్భంగా అభినందించారు. మేనేజింగ్ డైరెక్టర్ మర్రి సత్యనారాయణ, ప్రణవి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ విష్ణుమూర్తి నాయక్, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెంకటరావు, టీడీపీ రాష్ట్ర చైర్మన్ యువత రామకృష్ణ, ఓవర్సీంగ్ ఎండీ అనిల్ చౌదరి, సువర్ణ కుటీర్ సీఈవో బాలూ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ నాయక్, జనరల్ సెక్రటరి రామ్‌నాయక్, కొండా నాయక్, ఏడుకొండలు నాయక్, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బర్మానాయక్, డాక్టర్ కె.సంధ్యా బాయి, జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు హనుమా నాయక్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

నరసరావుపేట కోర్టు సంచలన తీర్పు



తన్నీరు అంకమ్మరావు

నరసరావుపేట లీగల్, మే 15, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని 2023 మే 4న జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి ఉరిశిక్ష విధిస్తూ గురువారం స్థానిక పదమూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ సంచలన తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలు.. స్థానిక లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద షేక్ సలీమా(52) అనే మహిళ దారుణంగా హత్యకు గురైంది. తొలుత గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో ఆమె పట్టణంలోని ఎస్ఆర్కేటీ ప్రాంతానికి చెందిన మహిళగా తేల్చారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు తన్నీరు అంకమ్మరావు సలీమాను హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారు. అంకమ్మరావుపై మరో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయి.

మినీ మహానాడులు నిర్వహించాలి : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మినీ మహానాడులను నిర్వహించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఈ మినీ మహానాడులు వైభవంగా నిర్వహించాలని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకుల సూచించారు. రాష్ట్రాన్ని దుర్మార్గంగా పరిపాలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కబంధ రాక్షస హస్తాల నుంచి విడిపించేందుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చేసిన కృషి, పోరాటం ఫలితంగా బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కలయికతో అద్భుతమైన విజయాన్ని సాధించిన సందర్భంగా ఈ మినీ మహానాడులను ఘనంగా నిర్వహించాలని కోరారు. పార్టీ బలోపేతం, పరిపాలన పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, మార్గదర్శకమైన మార్పులపై నిర్ణయాత్మకమైన సలహాలు అందించాలన్నారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పమిడివారిపాలేనికి చెందిన గొర్రెలకాపరి ఇరుపన కోటేశ్వరరావు(38) చెరువులో పడి గురువారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బుధవారం కోటేశ్వరరావు గొర్రెలను పొలాలకు తోలుకొని వెళ్లాడు. మందను తన భార్యకు అప్పగించి.. ఇంటికి వచ్చి గేదెలను పొలానికి తోలుకొని వెళ్తుండగా అవి చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో కోటేశ్వరరావు పడిపోయాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోడంతో, ఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యి ఉండడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

దుర్గి, మే 15 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆత్మకూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుప్పాల అయ్యపురెడ్డి (42) తనకున్న రెండు ఎకరాల సొంత పొలంతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశారు. మూడేళ్లుగా గిట్టుబాటు ధర, దిగుబడి రాకపోవడంతో రూ. 15 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పుల తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపంతో గురువారం తన పొలంలో పురుగు మందు తాగాడు. పక్క పొలం రైతులు గమనించి అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పొలం వద్దకు చేరుకొని అయ్యపురెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై రాత్రి 10 గంటల వరకు పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ట్రాక్టర్ బోల్తా.. 25 మందికి గాయాలు

నూజెండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన 25 మంది గురువారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో జరిగిన సంస్మరణ కార్యక్రమాల్లో పాల్గొని, తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్ అదుపు తప్పి పడి పోవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నారిశెట్టి త్రిపుర సుందరరావు, మన్నెం చిన్న కోటయ్యను గుంటూరు తరలించగా నాగులపాటి శ్రీను, పెద రంగయ్య, కూచిపూడి రంగయ్య, నాగులపాటి కోటయ్య వినుకొండ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): బుడంపాడు గ్రామంలో హెచ్‌టీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు బుడంపాడు గ్రామంతో పాటు ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్‌కు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

18న శ్రీకన్యకా పరమేశ్వరి అర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 18న ఏటుకూరు రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు అన్నా పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీకన్యకా పరమేశ్వరి అర్యవైశ్య సంఘం ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సమ్మెను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): జాతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామన్న హామీని అమలు చేయలేదని విమర్శించారు. సంక్షేమ బోర్డును తక్షణమే కార్యాచరణలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, డేగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మిరియాల గోపి, జాస్తి వీరాంజనేయులు

ఆడిటోరియం అభివృద్ధికి నిధులు కేటాయించండి..

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): అమరావతి రోడ్డు, అన్నదాన సమాజ అడిటోరియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపి కుమార్ కోరారు. గురువారం ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌కు వారు వినతిపత్రం అందజేసి, ఆడిటోరియం పరిస్థితులను వివరించారు. నిధులు విడుదలకు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, బోడపాటి కేశవ నాయుడు ఉన్నారు.

సమ్మెకు సహకరించండి..

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పాల్గొంటారని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు అరండల్‌పేట, కార్మిక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏ గాయత్రిదేవికి సమ్మెనోటీసు అందజేశారు. కార్యక్రమంలో మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, రావుల అంజిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై హర్షం

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులలో 75 మందికి ప్రత్యక్ష నియామకాల ద్వారా ఉద్యోగాల భర్తీ చేయడం పట్ల ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ, నగర ప్రాజెక్టు అధ్యక్షురాలు కే చిన్నవెంకాయమ్మ ఐసీడీఎస్ పీడీ కె విజయలక్ష్మి కలిసి ధన్యవాదాలు తెలిపి, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్స్‌గా మార్చాలని, మినీ వర్కర్లకు కూడా వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా పలుమార్లు ఆందోళన చేయడం జరిగిందన్నారు. దీంతో 71 మందికి హెల్పర్లుగా, మరో నలుగురు వర్కర్లుగా ఉద్యోగాలు పొందారని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బొల్లి మచ్చలకు లేజర్ వైద్యచికిత్సలు

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): బొల్లి మచ్చలు, సొరియాసిస్, ఎగ్జిమా వంటి పలు రకాల చర్మవ్యాధులకు ప్రభుత్వాస్పత్రిలో లేజర్ వైద్య చికిత్సలు అందుబాట్లోకి వచ్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గుంటూరు చర్మవ్యాధుల వైద్యనిపుణుల సంఘం వితరణతో రూ.3 లక్షల విలువైన లేజర్ ఎగ్జిమ్ వైద్య పరికరాన్ని జీజీహెచ్‌కు విరాళంగా అందజేశారు. గురువారం ఈ వైద్య పరికరాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల చర్మవ్యాధుల చికిత్సల్లో లేజర్ అత్యంత కీలకమన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, డీవీఎల్ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లేజర్ పరికరం ప్రారంభిస్తున్న డాక్టర్ రమణ యశస్వి



మాట్లాడుతున్న జూపూడి రంగరాజు, పాల్గొన్న డేగల ప్రభాకర్, గాదె వెంకటేశ్వరరావు, కంచర్ల శివరామయ్య తదితరులు

రేపు తిరంగా యాత్ర

● ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలి
● కూటమి నాయకుల పిలుపు

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఈనెల 17వ తేదీన నగరంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తిరంగా యాత్రను నిర్వహించనున్నట్టు కూటమి నేతలు తెలిపారు. స్థానిక చంద్రమౌళి నగర్, బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీ జే పీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ యాత్రకు అన్ని మతాలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. టర్కీ ప్రభుత్వం పాకిస్థాన్‌కు చేసిన సహాయాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతున్న తిరంగా యాత్ర ఉదయం ఎనిమిది గంటలకు హిందూ కాలేజ్ సెంటర్ నుంచి ప్రారంభమై లాడ్జీ సెంటర్ వరకు జరుగుతుందని తెలిపారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మనకోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తిరంగా యాత్రలో పాల్గొని సైనికులకు మద్దతు పలకాలని అన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ భారత్ విజయం సాధించిన సందర్భంగా రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి, టీడీపీ నాయకుడు కంచర్ల శివరామయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను గందరగోళానికి గురిచేయడం తగదు

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎం రఘునాథరెడ్డి

గుంటూరు (విద్య), మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్ని వివిధ జీవోల ద్వారా 9 రకాలుగా విభజించి గందరగోళానికి గురి చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. గురువారం కొత్తపేటలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న జీవో నం.117 ఉన్నత పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేస్తే... దాన్ని రద్దు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఈ మూడు జీవోలు ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన 4706 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులను నిబంధనల ప్రకారం ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్లను మిగులుగా చూపించి వారిని తీసుకోవాలని చూడడం ఎస్ జీటీలకు అన్యాయం చేయడమేనన్నారు. జిల్లా అధ్యక్షుడు డీ పెదబాబు, కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిసారి బదిలీల విషయంలో ప్రతి ప్రభుత్వం కొత్త కొత్త ప్రతిపాదనలు తెచ్చి ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో ఫలితాలు సాధించడం హర్షణీయం

● ఎన్నారై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు



ర్యాంకు సాధించిన అనన్యను సత్కరిస్తున్న పిడికిడి తిలక్ బాబు తదితరులు

గుంటూరు(విద్య), మే 15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఫలితాల్లో ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల, రోటరీ క్లబ్ అఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ లో పాల్గొన్న విద్యార్థులు ర్యాంకులు సాధించారని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిడి తిలక్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ వద్ద ఉచిత శిక్షణ పొందిన విద్యార్థిని కాకుమాను అనన్య 116/120 మార్కులు సాధించి జిల్లాలో మూడో ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 360 ర్యాంకు పొందినట్లు తెలిపారు. ఉచిత శిక్షణ తీసుకున్న 243మంది విద్యార్థుల్లో అందరూ అర్హత సాధించడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా అనన్యను రోటరీ అచీవర్స్ క్లబ్ సెక్రటరీ కొండపనేని విజయకృష్ణ తదితరులు అభినందించారు.

బీజేపీ పాలనలో మానవ హక్కుల ఉల్లంఘన

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గుంటూరులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ పురుషుల పురుషాంగాలను కోయటం, మహిళలపై అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదేనా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చెప్పే సనాతన ధర్మం అని ప్రశ్నించారు. 25 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీలకు బ్యాంకుల్లో ఒక్క శాతం మాత్రమే రుణాలిస్తున్నాయని, దాదాపు 50 శాతం ఓబీసీలు ఉంటే వారికి రెండు శాతమే రుణాలిస్తున్నాయన్నారు. ఒక్కశాతం ఉన్న మార్వాడీలకు, గుజరాతీలకు 50శాతంకు పైగా బ్యాంకులు రుణాలిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ బ్యాంకులు కొందరి సొత్తు కాదని, అందరి సొత్తన్నారు. సహజ వనరుల్లో వర్గీకరణ కావాలని, లేకుంటే ప్రతి జిల్లాలో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు.

ఆస్తిపత్రాలు తాకట్టు పెట్టుకుని మోసం

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపత్రాలు తాకట్టు పెట్టుకున్న వ్యక్తి వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టుకుని మోసం చేశాడని హనుమయ్యనగర్‌కి చెందిన షేక్ ఖాసింబి ఫిర్యాదు మేరకు విజయవాడ మారుతినగర్‌కి చెందిన షేక్ జానీబాషపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. 2017లో కూతురి పెళ్లి ఖర్చుల నిమిత్తం ఖాసింబి జానీబాష వద్ద ఇంటి కాగితాలు తాకట్టు పెట్టి రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. పలు దఫాలుగా నగదు చెల్లించినా ఖాసింబీకి తెలియకుండా ఇంటి పత్రాలను బ్యాంకులో తనఖా పెట్టి రూ.19 లక్షల రుణం జానీబాష తీసుకున్నాడు. రుణం చెల్లించని కారణంగా బ్యాంకు వారు సదర ఇంటిని వేలం వేస్తున్నట్లు ఖాసింబీకి తెలిసింది. దీంతో తనను మోసం చేసిన జానీబాషాపై ఖాసింబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి గుంటూరు రైల్వేస్టేషన్ వద్ద గురువారం రాత్రి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కొత్తపేట పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారంలో భద్రపరచారు. మృతుడ్ని గుర్తించిన వారు 0863 2221815కు గానీ, సీఐ వీరయ్యకు 8688831320లో గానీ, ఎస్ఐ శ్రీనివాసరెడికి 919849272293లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే వేసవి శిబిరాలు

గుంటూరు, కార్పొరేషన్, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అన్నారు. పాఠశాలలో గత నెల 24 నుంచి జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విద్యార్థులను ప్రోత్సహించిన తల్లితండ్రులని, ఆసక్తిని కనపరిచిన విద్యార్థులని, సహకరించిన పాఠశాల సిబ్బందిని అభినందించారు. శిబిరాల్లో విద్యార్థుల భావితరాలకు ఉపయోగపడే కోడింగ్, చెస్ వంటి శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. టెర్రరియం, వావ్, ఆర్ట్, క్రాఫ్ట్, యోగ, మ్యూజిక్, క్లాసికల్, వెస్ట్రన్ డాన్స్, ఎరోబిక్స్, స్కేటింగ్, కాలిగ్రఫీ, థియేటర్, ఫన్ విత్ మాథ్స్, సైన్స్, రోబోటిక్స్ వంటి తరగతులు జరిగాయని వివరించారు. అనంతరం మంచి ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగానికి గుర్తుగా విద్యార్థులు ప్రదర్శించిన ఆపరేషన్ సిందూర్ నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి, సీనియర్ కోఆర్డినేటర్ దోసకాయల దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న సూర్యదేవర హనుమంతరావు, పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు



జెండా ఊపి కళాజాతాను ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మీ

ఎయిడ్స్‌పై కళాజాత ప్రచారాలు

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన కళాజాత బృందాల ప్రచార కార్యక్రమాలు తిరిగి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరత సాకుగా చూపి వాటిని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాలన చేపట్టడంతో తిరిగి కళాజాత ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నిధులు విడుదల చేయడంతో గురువారం కళాజాత ప్రచార కార్యక్రమాలను డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో 20 రోజుల పాటు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై కళాజాత బృందాలు తమ ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డ్యాప్కు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శాంసన్, ఐసీటీసీ జిల్లా కోఆర్డినేటర్ జే వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



జేకేసీ కళాశాల రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రోడ్డు క్రాసింగ్ కోసం నిరసన

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులో సెంటర్ డివైడర్ నిర్మాణ పనుల సందర్భంగా ప్రధాన జంక్షన్‌లో రోడ్డు క్రాసింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడంపై గురువారం స్థానికులు నిరసన తెలిపారు. ఆర్టీఏ కార్యాలయం నుంచి జేకేసి కళాశాల రోడ్డు వైపు సెంట్రల్ డివైడర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. అయితే మధ్యలో టానిక్ బార్ ఎదురుగా తారక రామనగర్లోకి రాకపోకలు సాగించేందుకు రహదారి ఉంది. నిత్యం 400 కుటుంబాలకు పైగా రాకపోకలు సాగిస్తున్న తమకు డివైడర్‌కు క్రాసింగ్ అవకాశం ఇవ్వాలని స్థానికులు నగరపాలక సంస్థ అధికారులకు గతంలోనే విజ్ఞప్తి చేశారు. అయినా అక్కడ క్రాసింగ్‌కు అవకాశం లేకుండా కొద్ది దూరంలో క్రాసింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. తొలుత అంగీకరించి తాజాగా నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయాన్ని మార్చుకోవడాన్ని నిరసిస్తూ గురువారం టానిక్ బార్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న షేక్ మస్తాన్‌వలి(52) గురువారం మృతి చెందినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన మస్తాన్‌వలి ఈ నెల 6న ద్విచక్రవాహంపై గుంటూరు వస్తుండగా మిర్చి యార్డు సమీపంలోని వె జంక్షన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన మస్తాన్‌వలిని స్థానికులు జీజీహెచ్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మస్తాన్‌వలి మృతి చెందగా అతడి కుమారుడు అబ్దుల్‌మతిన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలుజారి పడి..

ఇంట్లో కాలుజారిపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ రెడ్డిపాలేనికి చెందిన పర్వతం గురువారెడ్డి(75) గురువారం మృతి చెందినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకే ఆత్మీయ పురస్కారం



డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో వైకే నాగేశ్వరరావు జయంతి సందర్భంగా గురువారం ఆత్మీయ పురస్కార సభ జరిగింది. సభాధ్యక్షులుగా యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆత్మీయ అతిథులుగా రామరాజు ఫౌండేషన్, రామరాజు శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి సహకార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు, శారద కళా సమితి, అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, బ్రాంచ్ మేనేజర్ ఆప్కాబ్ పీ లక్ష్మి సువర్చల, నూతలపాటి తిరుపతయ్య పాల్గొని డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకే నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కార ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ బృందంచే సత్యహరిశ్చంద్ర నాటకం నుంచి వారణాసి, కాటిసీను ఘట్టాలను అద్భుతమైన పద్యాలతో నాటకాభిమానులను అలరించారు. కార్యక్రమాలను లంక లక్ష్మీనారాయణ, బొప్పన నరసింహారావు, భాగీ శివశంకరశాస్త్రి, ఏంఏ హమీద్, జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న మాధురి, పాల్గొన్న ఎల్‌పీజీ డీలర్లు, డెలివరీ బాయ్స్

గ్యాస్ సరఫరా వాహనాల్లో ఎలక్ట్రానిక్ కాటా ఉండాలి

● జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి

గుంటూరు(తూర్పు), మే 15(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సరఫరా చేసే వాహనాల్లో లీగల్ మెట్రాలజీ వారిచే ధృవీకరించిన ఎలక్ట్రానిక్ కాటా అందుబాటులో ఉంచుకుని, సరఫరా సమయంలో సిలిండర్ నికరబరువును వినియోగదారునికి చూపించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎన్ ఎస్ మాధురి అన్నారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలకలూరు రోడ్డు, గుంటూరు క్లబ్‌లో జరిగిన ఎల్‌పీజీ డీలర్లు, డెలివరీ బాయ్స్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. దిగుమతి చేసుకునే సమయంలోనే సిలిండర్ల బరువును తనిఖీ చేసుకోవాలని డీలర్లకు సూచించారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్‌ను ప్రతి ఏడాది మెట్రాలజీ వారిచే ధృవీకరించుకోవాలని అన్నారు. గ్యాస్ బిల్లు కంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కంట్రోలర్ షాలమ్ రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ జి కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజా, ఎల్ పీ జీ డీలర్ల జిల్లా అధ్యక్షుడు శీలం రవి పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు

● రూ.6.53 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నసీర్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఏ ఒక్కరూ ఇబ్బందులకు గురి కాకూడదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. కిడ్నీలు దెబ్బతిని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది అప్పులపాలైన ఐపీడీ కాలనీకి చెందిన కారంశెట్టి ఆశాజ్యోతికి ఆయన గురువారం రూ.6.52 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి చెక్కు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్ల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని, బాధితులకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

ఖాజీల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాజీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాలలో రాష్ట్ర ఖాజీల విస్తృత సమావేశం నిర్వహించారు. ఏపీ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎస్‌ఎం షరీఫ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌తో కలిసి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింల వివాహ సందర్భంగా ఖాజీలు ఇచ్చే వివాహాల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వ విభాగాలు పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెడ్ జోన్, గ్రీన్ జోన్‌లుగా విభజించి, ఖాజీలు లేని ప్రాంతాల్లో నూతనంగా నియామకాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట ప్రత్యేకంగా ఖాజీ బోర్డును కూడా ఏర్పాటు చేయడం ద్వారా ముస్లిం మైనార్టీల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు వీలవుతుందని చెప్పారు.



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

సహోద్యోగి కుటుంబానికి కానిస్టేబుళ్ల చేయూత

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గత నెల 17న 2012 బ్యాచ్‌కు చెందిన వీరయ్య అనారోగ్యంతో మరణించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అదే బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు తమ వంతు ఆర్థిక సహాయంగా లక్షా63 వేల నగదును గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ ద్వారా వీరయ్య తల్లి అంజనాదేవి, సతీమణి సౌజన్యలక్ష్మీలకు అందచేశారు. 2012 బ్యాచ్ కానిస్టేబుళ్ళ కృషిని ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

చేయూత పథకం కింద చెక్కులు

పోలీస్ శాఖ తరపున అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ వీరయ్య కుటుంబ సభ్యులకు, రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గత నెల 21న మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ క్రాంతికుమార్ కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరపున చేయూత పథకం కింద రూ.లక్ష చొప్పున ఎస్పీ వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఏఆర్ హనుమంతు, పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్, ట్రెజరర్ హాస్సేన్, సభ్యులు కరిముల్లా, 2012 బ్యాచ్ ఏఆర్ కానిస్టేబుళ్లు హరిబాబు, వెంకటేష్, సత్యనారాయణ, రవికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్ర జ్యోతి): దోమకాటు బారిన పడకుండా ప్రజలు స్వీయ రక్షణ చర్యలు పాటిస్తే డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. మే 16న జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని గురువారం తన ఛాంబర్‌లో ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో జరిపిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆమె కోరారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీ వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానికంగా ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సుబ్బరాయణం, డాక్టర్ విజయ్‌ప్రకాష్, డాక్టర్ జయరామకృష్ణ, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



డెంగీ ఫ్లెక్సీతో డాక్టర్ విజయలక్ష్మీ, వైద్యాధికారులు

అమరావతి రాజధానిని..
అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- నేను తమాషాగా చెప్పడం లేదు.. మీరే వెళ్లి చూడొచ్చు
- డీఐఎల్ఆర్ఎంపీ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'గుంటూరుకు 200 ఏళ్ల చరిత్ర ఉంది. అయినా కొన్నేళ్లుగా విస్మరణకు గురవుతోంది. అందుకే ఏ చిన్న అవకాశం వచ్చినా జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లు, సదస్సులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం.' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం వర్క్‌షాప్‌లో ఆయన జిల్లా చరిత్రని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రభుత్వ అధికారులకు నివేదించారు. ఈ జిల్లాలోనే అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తమ విజనరీ నాయకుడు, సీఎం చంద్రబాబు నేతృత్వంలో నిర్మిస్తున్నామని వివరించారు. దేశంలో మరో నగరం అమరావతిలా ఉండే అవకాశం లేదని కొనియాడారు. మరోసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఇలాంటి సదస్సుని అమరావతిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే అమరావతి రాజధాని నిర్మాణం జరగాల్సి ఉందని, 2019లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు అమరావతికి వెళ్లినా అక్కడ నిర్మాణం జరిగిన మూడు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు చూడొచ్చని, అవి అమెరికాలోని యూనివర్శిటీల కంటే బాగున్నాయంటూ కితాబిచ్చారు. అమరావతి అభివృద్ధి గురించి తాను ఏమి తమాషాలు చెప్పడం లేదన్న పెమ్మసాని, రాజధాని నిర్మాణం పూర్తి అయిన తర్వాత చూసి మీరే ఆశ్చర్యపోతారని ప్రతినిధులకు వివరించారు.

2027కి రీసర్వే పూర్తి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా కేవలం భూమిని కొలవడం మాత్రమే కాదు, విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు బలమైన, ఆధునిక, సమగ్ర భూ రికార్డుల వ్యవస్థకు పునాది వేస్తున్నామని చెప్పారు. రీసర్వే జరిగిన ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి భూయజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. భూసర్వేపై సమగ్ర సమాచారాన్ని యజమానులకు అందించడానికి ప్రతీ బ్లాక్‌కు 50 నుంచి 70 మందిలో వాట్సాప్ గ్రూపులు కూడా ఏర్పాటు చేశామన్నారు. సర్వే షెడ్యూల్ వాట్సాప్, ఫోన్‌కాల్స్, రిజిష్టర్డ్ పోస్టు ద్వారా యజమానులకు ముందుగానే తెలియజేస్తున్నామన్నారు. ప్రతీ



వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కన రెవెన్యూ మంత్రి అనగాని

భూయజమాని వారి భూమి కొలత సమయంలో హాజరు కావడానికి మూడుసార్లు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. భూయజమానులు వ్యక్తిగతంగా హాజరు కాకపోతే వారి సరిహద్దులను గుర్తించడానికి వీడియో కాల్స్ ఆప్షన్‌ని కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. 2027 ఆఖరుకు రీసర్వే పూర్తి చేస్తామన్నారు.

రీసర్వేకు రూ.600 కోట్లు

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రెటరీ మనోజ్ జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమం కచ్చితమైన ప్రమాణాలతో వేగవంతంగా జరుగుతుందని ప్రశంసించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల సర్వే, రీ సర్వే కార్యక్రమం చాలా పురోగతిని సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేకి రూ. 600 కోట్ల వరకు ఖర్చు పెట్టిందని వెల్లడించారు. కేంద్రం త్వరగా తమకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ భూముల రీసర్వే, పట్టణాల్లో భూముల రీసర్వే కార్యక్రమమైన నక్షా ప్రక్రియకి సంబంధించి వివిధ దశలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనని ఆహ్వానితులకు చూపించారు. అలానే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లోనే..అధికారితో
ఉద్యోగిని అసభ్య ప్రవర్తన

- సీటీ శాఖలో హాట్‌టాపిక్‌గా వ్యవహారం
- ఉన్నతాధికారికి వీడియో దృశ్యాలు, విచారణకు ఆదేశం

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారి వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగానే చాంబర్‌లో అధికారితో మహిళా ఉద్యోగిని అసభ్యంగా ప్రవర్తించడం వాణిజ్యపన్నుల శాఖలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం చూసిన సదరు ఉన్నతాధికారి వారిద్దరిని పిలిచి చీవాట్లతో సరిపెట్టినప్పటికీ ఇది కాస్త పైఅధికారుల దృష్టికి వెళ్లడంతో హాట్‌టాపిక్‌గా మారింది. సదరు ఉద్యోగులపై చర్యలు తప్పవని ప్రచారం జరుగుతోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం పూర్వపరాల్లోకి వెళితే... వాణిజ్య పన్నుల శాఖ గుంటూరులోని ఓ డివిజన్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ మూడు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదే సమయంలో మరో అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండగానే చాంబర్‌లోకి వచ్చిన ఓ మహిళా ఉద్యోగిని సదరు అధికారితో అసభ్యంగా ప్రవర్తించారు. ఇది చూసిన ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేసి ఇద్దరిని తన చాంబర్‌కు పిలిపించుకొని చీవాట్లు పెట్టినట్లు సమాచారం. ఇంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అంతా భావించారు. కానీ ఈ వ్యవహారం విజయవాడలోని ఉన్నతాధికారి దృష్టికి వెళ్లింది. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉద్యోగిని చేసిన అసభ్య ప్రవర్తనపై ఫుటేజీలతో సహా ఫిర్యాదు వెళ్లింది. దీనిని ఉన్నతాధికారి సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. మూడు రోజులుగా ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్నట్లు చెబుతున్నారు. వీడియో దృశ్యాలు, ఫిర్యాదును పరిశీలించి సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారి తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో సదరు అధికారి, మహిళా ఉద్యోగినిపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

కందుకూరులో రోడ్డెక్కిన పొగాకు రైతులు

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యాపారులు రోజురోజుకి ధరలు దిగజారుస్తున్నారంటూ నెల్లూరు జిల్లా కందుకూరులో రైతులు ఆందోళన బాటపట్టారు. గురువారం వేలం ప్రక్రియ ప్రారంభమయ్యాక ధరలు దారుణంగా తగ్గిపోతున్నాయని గుర్తించిన రైతులు వేలంను నిలిపివేసి వేలంకేంద్రం బయట రోడ్డుపై బైఠాయించారు. దూబగుంట సమీపంలో ఉన్న కందుకూరు-1 వేలం కేంద్రంలో ఆందోళన చేపట్టిన రైతులు కందుకూరు - కనిగిరి ప్రధాన రహదారికి ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేశారు. చెన్నిపాడు, బాలిరెడ్డిపాలెం రైతులు మాట్లాడుతూ వేలం ప్రారంభించిన సమయంలో నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర రూ.280గా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు కొద్దిరోజులు గడిచాక అతికొద్ది బేళ్లకు మాత్రమే ఆ ధర చూపిస్తూ అత్యధికశాతం నాణ్యమైన బేళ్లకు రూ.250లకే సొంతం చేసుకుంటున్నారని మండిపడ్డారు. బోర్డు అధికారులు రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

తెలుగువారి గుండెల్లో..
చెరగని సంతకం ఎన్టీఆర్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు

పెదనందిపాడు, మే, 15 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో చెరగని సంతకం ఎన్టీఆర్ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్ జగన్ నిర్లక్ష్యం వల్లే గ్రామాలు అంధకారంలో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం అందించిన సహాయాన్ని జగన్ ప్రభుత్వం తీసుకోపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులను సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న నిధులను వినియోగించుకుంటూ తీరుస్తూ, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కిలో బియ్యం రెండు రూపాయలకే ప్రవేశపెట్టి, పేదవారి కడుపు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన చేసిన మంచిని ముందు తరాలకు కూడా తెలియజేయాలన్నారు. అనంతరం విగ్రహ కమిటీ నిర్వాహకులు పెమ్మసాని, బూర్ల, లావులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. తొలుత లక్ష్మీపురం వద్ద నుండి ప్రచార వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్దకు చేరుకొని అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు వందనాదేవి, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, తాళ్ల వెంకట యాదవ్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, స్థలదాత కావు వెంకటసుబ్బారావు, విగ్రహదాత జాలాది నాగప్రసాద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు వేళాయే

- నేటి నుంచి జూన్ 2వ తేదీ వరకు అవకాశం
- జూన్ 3 నుంచి నిషేధం అమల్లోకి
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ ఖరారైంది. ట్రాన్స్‌ఫర్లపై ఉన్న నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు సడలిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. నిర్దేశిత సమయంలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, జూన్ 3 నుంచి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. ఉద్యోగుల సంక్షేమం, వారి ఉద్యోగ జీవితాన్ని సమతుల్యం చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ప్రజలకు సేవ చేయడంలో ఉద్యోగులు సరైన పోస్టులలో ఉండేలా చూసేందుకు బదిలీలు చేస్తున్నామని తెలిపింది. మే 31వ తేదీ లోపు ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల పాటు ఉన్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. వ్యక్తిగత విజ్ఞాపన మేరకు కూడా ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీలు చేయొచ్చు. 2026 మే 31 లోపు రిటైర్డు అయ్యే ఉద్యోగులను బదిలీ చేయరాదు. ఒకవేళ వారు కోరుకొంటే చేయొచ్చు. అలానే పరిపాలన సౌలభ్యం కోసం కూడా బదిలీ చేసే అవకాశాన్ని కల్పించింది.

వారికి ప్రాధాన్యం

బదిలీల్లో అంధ ఉద్యోగులు, బుద్ధిమాంద్యం, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసిన వారు, 40 శాతం వైకల్యం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. మెడికల్ గ్రౌండ్స్ ఆధారంగా బదిలీలు కోరుకుంటున్న వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కారుణ్య నియామకం పొందిన మహిళా ఉద్యోగులకు కూడా బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. అంధ ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయింపు ఇస్తారు. ఒక వేళ వాళ్లు బదిలీ కోరుకొంటే స్పష్టమైన ఖాళీ ఉంటే బదిలీ చేయొచ్చు. భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో పోస్టింగ్ చేయాలి. ఒకవేళ వీలు పడకపోతే సమీపంలోని గ్రామంలోనే పోస్టింగ్ చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా నిర్వహించాలి..

బదిలీలు పారదర్శకంగా చేయాల్సిన బాధ్యతని సంబంధిత ప్రభుత్వ శాఖ జిల్లా అధికారిపై ప్రభుత్వం ఉంచింది. బదిలీల్లో ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలు రావడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన అసోసియేషన్లలో ఆఫీసు బేరర్లుగా ఉన్న ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయించాలి. ఈ విషయంలో మూడు పర్యాయాలు/9ఏళ్ల స్టే నిబంధనని పాటించాలి. ఆఫీసు బేరర్ల జాబితాను సంబంధిత హెచ్‌వోడీలకు కలెక్టర్ ద్వారా ఆయా అసోసియేషన్లు పంపించాలి. అయితే ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీ చేసే అధికారాన్ని పరిపాలన సౌలభ్యం కోసం కాంపిటెంట్ అథారిటీకి కేటాయించింది. ఏవైతే డిపార్టుమెంట్లకు ఏకీకృత ఆపరేషనల్ సిస్టమ్స్ ఉన్నాయో ఆయా శాఖలు విడిగా మార్గదర్శకాలు జారీ చేయొచ్చు.

ఆదాయం ఉన్నా..
అభివృద్ధి సున్నా

- అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్ యార్డు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నిజాంపట్నంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

రేపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా కూచినపూడి మార్కెట్ యార్డు అభివృద్ధిని పాలక యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి యార్డు అద్దె భవనాల్లో కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నియోజకవర్గం రద్దు కాకముందు ప్రత్యేక మార్కెట్ యార్డు కావాలని ఈ ప్రాంత రైతులు కోరారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్ యార్డును మంజూరు చేశారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి జిల్లాకు చెందిన మంత్రులు కాసు కృష్ణారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, మోపిదేవి వెంకటరమణరావు అట్టహాసంగా యార్డును ప్రారంభించారు. కానీ, ఆ తర్వాత దానిపై దృష్టి సారించిన వారే కరువయ్యారు. నిజాంపట్నం మండలం కూచినపూడిలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నుంచి మార్కెట్ యార్డును నిజాంపట్నం తరలించారు. ప్రస్తుతం అక్కడ కూడా అద్దె భవనంలోనే మార్కెట్ యార్డు కొనసాగుతోంది. కనీసం మార్కెట్ యార్డుకు ఒక్క గోడౌన్ కూడా లేదు. ఈ మార్కెట్ యార్డు పరిధిలో వందలాది గ్రామాల్లోని రైతులు వినియోగించుకుంటారు. ఒక్క గోడౌన్ కూడా లేకపోవటంతో పండించిన పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం వస్తున్నా కనీసం యార్డుకు స్థలసేకరణ చేసిన దాఖలాలు లేవు. గోడౌన్ గత వైసీపీ పాలకులు విస్మరించారు.

అరకొర వసతులే

కూచినపూడిలో అరకొర వసతుల మధ్య మార్కెట్ యార్డు భవనం కొనసాగుతోంది. గతంలో కూచినపూడి, లింగినేనివారిపాలెం మధ్యలో కొంత భూమిని పరిశీలించారు. అది ప్రధాన రహదారికి దూరంగా ఉందని విరమించుకున్నారు. యార్డు తొలి అధ్యక్షుడిగా రావి సాంబశివరావు విధులు నిర్వహించారు. యార్డు నిర్మాణానికి పాలకవర్గం చేసిన అభివృద్ధి నామమాత్రమే. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు చైర్మన్‌ను నియమించారే తప్పా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. రైతులకు మేలు చేసిందేమీ లేదని తీరప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పల్లపట్ల సమితి భవనాన్ని మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించ లేదు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందాన పరిస్థితి ఉంది. రైతులు పండించిన ధాన్యాన్ని గోదాముల్లో భద్ర పరిచి గిట్టుబాటు, దర వచ్చి విక్రయాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. కానీ గోదాములు లేకపోవడంతో ఆ పథకం పడకేసింది. కూటమిప్రభుత్వం అధికారం చేపట్టటంతో ఇటీవల మార్కెట్ యార్డు చైర్మన్‌ల నియామకం జరిగింది. టీడీపీ నిజాంపట్నం అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్‌ను మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి పాలనలోనైనా యార్డును అభివృద్ధి చేస్తారని, పక్కా భవనాలను కల్పిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు

ఏటా రూ.కోట్లలో రాబడి

మార్కెట్ యార్డు పరిధిలో చెక్‌పోస్టుల ద్వారా మొదటి ఏడాది రూ.50 లక్షలు ఆదాయం వచ్చింది. తర్వాత నుంచి ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.2 కోట్ల మేరకు ఆదాయం చేరింది. వసతుల కల్పనలో అధికారులు, పాలకులు తీసుకున్న చొరవ ఎక్కడా కనిపించడం లేదు. గోదాము నిర్మిస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో కూచినపూడిలో ఉన్న యార్డును రేపల్లె - నిజాంపట్నం ప్రధాన రహదారి పక్కన ఉన్న పల్లపట్ల సమితి కార్యాలయానికి మార్చాలనే ప్రతిపాదన పెట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందచేశారు. ఆ తర్వాత పురోగతి లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని మార్కెట్‌యార్డు పల్లపట్ల సమితి భవనంలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని రైతులు, తీరప్రాంత వాసులు కోరుతున్నారు.

నృసింహుని దర్శించుకున్న మీనాక్షి లేఖి



కేంద్ర మాజీమంత్రి మీనాక్షి లేఖితో మంగళగిరి బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మీనాక్షి లేఖి గురువారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. ఆమెకు బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. తొలుత దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి, శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎగువ సన్నిధిలో పానకాల స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, నేతలు నాగలక్ష్మి, గీతా మాధురి, విజయవాణి, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల దుర్గారావు, రాకేష్‌జీ, మణికంఠ, కాండ్రు భానుకిషోర్, కమల కృష్ణ, రామమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 17, 18 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07441) చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు నడికుడి, 6.40కి గుంటూరు, ఆదివారం వేకువజామున 3.35కి విశాఖపట్టణం చేరుకొంటుంది. (07442) విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 18న ఆదివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 6 గంటలకు గుంటూరు, 7.10 గంటలకు నడికుడి, 11.40కి చర్లపల్లి చేరుకొంటుందని తెలిపారు.



వర్షంలో చిన్నారుల చిందులు



వర్షపు నీటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ..



పట్టాభిపురం రోడ్డులో గాలి దుమారంలో పడిపోయిన బారికేడ్లు

ముండుతూనే..ముంచెత్తింది..!

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేసవి మంట పుట్టించింది. ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రానికి నాలుగు గంటల నుంచే ఆకాశం మేఘావృతమైంది. ఒక్కసారిగా గాలి, ఉరుములు, మెరుపులతో జోరు వర్షం కురిసింది. దాంతో నగరమంతా తడిసి ముద్దయింది. అర్ధగంట పాటు జోరు వర్షం కురవడంతో కొన్ని దిగువ ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ప్రజలకు అసౌకర్యం కలిగించింది. గురువారం ఉదయం నుంచే ఎండ వేడిమి మొదలైంది. మధ్యాహ్నానికి ఎండ ప్రతాపం చూపుతూ వడగాలులు సైతం ప్రజల్ని ఆందోళనకు గురిచేశాయి. వేసవి తాపం తట్టుకోలేక ప్రజల రాకపోకలు మధ్యాహ్నానికే మందగించాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచే వాతావరణంలో మార్పు వచ్చింది. జోరు వర్షానికి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు పరుగులు పెట్టారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 1115 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,100, గరిష్ఠధర రూ.11,700, మోడల్‌ధర రూ.11,100పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,150 మోడల్‌ధర రూ.10,720 పలికాయి.

క్రీస్తు మార్గం ఆచరణీయం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



చర్చిని ప్రారంభించి లోపలికి వస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

మేడికొండూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు మార్గం ఆచరణీయమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వరగానిలో నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్ట్ చర్చిని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవ, శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చిల నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దండా సాంబిరెడ్డి, పలు గ్రామాల పాస్టర్లు, చర్చిపెద్దలు పాల్గొన్నారు.

ఉండవల్లిలో చర్చి ప్రారంభం

తాడేపల్లి(ఉండవల్లి), మే 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో అంబేద్కర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన లూథరన్ చర్చిని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జంగాల సాంబశివరావు, బుర్దగుంట వేణుగోపాలరావు, దొప్పలపూడి జ్యోతి బసు, రాయపూడి కిరణ్, సుకుమార్, సామల నాగేశ్వరరావు, గంజి చిరంజీవి, భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై పాడి రైతులకు అవగాహన సదస్సు

దుగ్గిరాల, మే 15(ఆంధ్రజ్యోతి): గొడవర్రు సచివాలయం ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణాల మంజూరీ కోసం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇదివరలో కౌలురైతు రుణాలు, పశువుల దాణా రుణాలు సకాలంలో చెల్లించిన వారికి తక్షణమే రుణాలు అందించడం జరుగుతుందన్నారు. కౌలు రైతుసంఘ జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు, పశువైద్యుడు డాక్టర్ కే వెంకటసురేష్, పి.స్వర్ణమంజర, చైతన్యబ్యాంకు మేనేజర్ బీ. రవి, పెదపాలెం యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎల్లమందయ్య పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలి

కాకుమాను, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మారిన నేపథ్యంలో గ్రామంలో విద్యనభ్యసించే విద్యార్థులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరుతూ మండల విద్యాశాఖాధికారి కె.విజయ్‌భాస్కరరావు, స్థానికులతో కలసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన హై స్కూల్లోనే మన పిల్లలను చదివిద్దాం అనే నినాదంతో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త యార్లగడ్డ అంకమ్మ చౌదరి, టీడీప్రసాద్, దానయ్య, మండవ లక్ష్మీనారాయణ, మాణిక్యరావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

● పాశం రామారావు

పెదనందిపాడు, మే, 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రజా సంఘ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, పణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మీ, సుజాత, అనూష, నలీం తదితరులు పాల్గొన్నారు.

● **తాడికొండ, (ఆంధ్రజ్యోతి):** దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు తెలిపారు. గురువారం తాడికొండలో సీఐటీయూ, కార్మిక, వ్యవసాయ నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్మిక రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, పంచాయతీ వర్కర్స్ కార్మిక నాయకుడు నూతక్కి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి):** గురువారం టీటీడీ యార్డులో జరిగిన ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ మండల నాయకుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ 20వ తేదీ ఉదయం కార్మికులందరూ 9గంటలకు తాడేపల్లిలోని సాయిబాబ గుడివద్దకు రావాలని అక్కడ నుంచి కార్మిక ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ఐదేళ్లలో అన్ని గ్రామాల అభివృద్ధి

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

● రూ.82 లక్షల వ్యయంతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము ప్రారంభం

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తిమ్మాపురంలో రూ.82 లక్షల వ్యయంతో నిర్మించిన వెయ్యి టన్నుల సామర్థ్యం గల బహుళ ప్రయోజన సౌకర్య గోదామును గురువారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నేను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినే నన్నాడు. రైతుల కష్టాలు, బాధలు తెలుసునన్నారు. ధరలు రైతుల చేతుల్లో నుంచి దళారీల చేతుల్లోకి వెళుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి గోదాములు నిర్మించుకోవడం వల్ల రైతులు తాము పండించిన పంటలను నేరుగా అమ్ముకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో చెరువులు ఎలా ఉంటున్నాయో రైతులు తాము పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు వీలుగా గోదాములు కూడా ఉండాలన్నారు. పుట్టిన ఊరి కోసం గిడ్డంగి నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన దాత దొప్పలపూడి సాంబశివరావు, ఉమాదేవి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు దంపతుల ను కూడా మంత్రి పెమ్మసాని సన్మానించారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, పార్టీ మండల ప్రసిడెంట్ గింజుపల్లి శివరామప్రసాద్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, జీడీసీసీబీ సీఈవో ఫణికుమార్, జిల్లా సహకార అధికారి వీరాచారి, అయినంపూడి నాగేశ్వరరావు, కుర్రి సుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోదామును ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గొట్టిపాడు రోడ్డు వేయించండి

గొట్టిపాడు రోడ్డు వేయించాలంటూ గ్రామ నాయకులు మంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో పనులు ప్రారంభమై ఆపివేశారని, రోడ్డు సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ వేడుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేతో చర్చించగా త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు.

తాగు నీరు ఇప్పించండి

చెరువులు ఎండిపోయాయి తాగునీరు ఇప్పించాలంటూ కోయవారిపాలెం గ్రామస్థులు పెమ్మసానిని కోరారు. తిమ్మాపురం వస్తున్న ఆయన్ను కోయవారపాలెం వద్ద స్థానిక నాయకులు, మహిళలు కలిసి గ్రామంలో ఉన్న తాగునీటి పరిస్థితులను వివరించారు. సత్వరమే కాలువ మరమ్మతులకు నిధులతో పాటు అవసరమైతే ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రజల ఆదరాభిమానమే వారసత్వంగా అందించిన వీరయ్యచౌదరి

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

● నాగులపాడులో విగ్రహావిష్కరణ

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల అశేష ఆదరాభిమానాలను తమ తండ్రి ధూళిపాళ్ల వీరయ్యచౌదరి వారసత్వంగా అందించి వెళ్లిపోయారని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు గ్రామంలో మాజీ మంత్రి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ ధూళిపాళ్ల వీరయ్యచౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల తన తండ్రి వీరయ్యచౌదరి విగ్రహాన్ని అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబ నుంచి వచ్చిన తన తండ్రి వీరయ్యచౌదరి అకుంఠిత దీక్షతో అంచెలంచెలుగా రాష్ట్ర మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. సంగం డెయిరీ అభివృద్ధి ద్వారా పాల రైతుల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపారని కొనియాడారు. ఆయన విలువలు, ఆశయాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. వెలకట్టలేని ప్రజాభిమానాన్ని ఆయన వారసత్వంగా తమకు అందించారని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తెలిపారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మరణించిన పాడిరైతు కొల్లా సురేంద్రబాబు కుటుంబసభ్యులకు పాలరైతు సంక్షేమ నిధి నుంచి రూ.30,000 నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, మాజీ మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, నాయకులు పాటిబండ్ల మురళీ, పాటిబండ్ల నాగరాజు, ఆళ్ల రాజారావు, ఆళ్ల నాగేశ్వరరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, ఆళ్ల ఫణిబాబు, బండి కిరణ్‌కుమార్, నంగినేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వీరయ్యచౌదరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నంద్రకుమార్

పారిశ్రామికాభివృద్ధిలో బీసీల భాగస్వామ్యం పెంచాలి

● సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

మంగళగిరి సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): వర్తక, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో వెనుకబడిన తరగతులకు చెందిన బీసీల భాగస్వామ్యం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు గురువారం బీసీ సంక్షేమ సంఘం నేతలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. తొలి నుంచి బీసీల సాధికారతకు కట్టుబడి ఉన్న టీడీపీ ప్రభుత్వం గతంలో బీసీ పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు కల్పించిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను రద్దు చేసిందని విమర్శించారు. టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గతంలో అమలు చేసిన రాయితీలు, ప్రోత్సాహకాలను తిరిగి అమలు చేసి బీసీ పారిశ్రామికవేత్తల అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరారు. అందుకోసం బీసీ సబ్‌ప్లాన్ ద్వారా పారిశ్రామిక విధానం అమలు చేసి, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీసీ మూర్తి, కార్య నిర్వాహక అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు పాల్గొన్నారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు, నేతలు

18న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

మంగళగిరి సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్ సెంటర్లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలియజేశారు. పురుషులు, మహిళల సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్విప్డ్, బెంచ్‌ప్రెస్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన పవర్ లిఫ్టర్లు వయస్సు ధ్రువీకరణ పత్రంతో 18వ తేదీ ఉదయం 8 గంటల కల్లా హాజరుకావాలని సూచించారు. వివరాలకు సెల్: 9700844497, 9346307979 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందిస్తున్న చిగురుపాటి సుబ్బారావు తదితరులు

తాడేపల్లి(గుండిమెడ), మే 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో మల్లవరపు నాగరాజు (లేటు)-రజని గార్ల కుమారుని వివాహానికి హాజరై వధూవరులు అనిత-పవన్‌లకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, బాబూరావు, తదితరులు వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పున్నమ్మ చెరువు స్థలంపై 21న విచారణ

తాడికొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): తాడికొండ అడ్డరోడ్డులో ఉన్న పున్నమ్మ చెరువు స్థలంపై ఈనెల 21వ తేదీన విచారణ ను అధికారులు చేపట్టనున్నారు. తాడికొండ అడ్డరోడ్డులో చెరువుగా ఉన్న స్థలాన్ని ఆక్రమించారని పొన్నెకల్లులో ఏప్రిల్ 14న సీఎం చంద్రబాబునాయుడు పర్యటించినప్పుడు గ్రామస్థులు, సీపీఐ నాయకులు సీఎంకు అర్జీని అందజేశారు. దీంతో స్పందించిన సీఎం ఉన్నతాధికారులకు పున్నమ్మ చెరువు ఆక్రమణ పై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పున్నమ్మ చెరువు స్థలాన్ని పరిశీలించారు. అంతేకాకుండా అర్జీలు దాఖలు చేసిన వారిని ఈ నెల 21వ తేదీన తాడికొండ పంచాయతీ కార్యాలయంలో పున్నమ్మ చెరువు స్థలంపై విచారణ చేస్తున్నట్లు దానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

ఆర్టీసీ డీఎం మొండి వైఖరి విడనాడాలి



దీక్షా శిబిరంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

మంగళగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మొండి వైఖరిని విడనాడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి వి.నాగేశ్వరరావు సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఆయనను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి రిలే దీక్షలు ప్రారంభించారు. తిరుపతయ్య మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతుందని చెప్పారు. నాగేశ్వరరావు ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే వాటిని పరిష్కరించకపోగా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ, యూనియన్ల నేతలు అన్నవరపు ప్రభాకర్‌రావు, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, రాచకొండ శివ, ఎస్‌కే కరీముల్లా, విజయ్‌కుమార్, రత్నాకర్ దీక్షలకు సంఘీభావం తెలిపారు.

ప్రకృతి విలయ తాండవం

● పెనుగాలుల బీభత్సం.. నేల వాలిన చెట్లు

● పడిపోయిన రీ సర్వే వర్క్ షాపు టెంట్లు



లేమల్లెపాడు వద్ద రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం



లేమల్లెపాడు వద్ద నేలకూలిన సర్వే, రీసర్వే టెంట్లు

వట్టిచెరుకూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు లేమల్లెపాడు గ్రామాల పరిధిలో గురువారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. రీసర్వే వర్క్ షాపు కోసం వేసిన టెంట్లు, ఇతర సౌకర్యాలు పూర్తిగా చిన్నాభిన్నమయ్యాయి. వర్క్ షాపుల నిర్వహణ కోసం టెంట్ల వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలు, ఆహార పదార్థాలకు వినియోగించిన డేగిశాలు గాలికి ఎగిరిపోయాయి. వివరాల్లోకి వెళితే డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరైజేషన్ ప్రోగ్రాం డీఐఎల్ఆర్ఎంపీ కింద సర్వే, రీ సర్వేపై జాతీయ వర్క్ షాపులు నిర్వాహణ సెంట్రల్ టీమ్‌ల కోసం అనంత వరప్పాడు, లేమల్లెపాడు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు నేల మట్టం అయ్యాయి. అనంతవరప్పాడు పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ వద్ద సంబంధిత సెంట్రల్ టీమ్ అధికారులకు జాయింట్ కలెక్టర్ భార్గవతేజ మ్యాప్ ద్వారా వివరిస్తున్న సమయంలో ఒక్కసారిగా పెను గాలులు వీచాయి. టెంట్లు పొలంలో ఏర్పాటు చేయటంతో సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు వైపు పరుగులు తీశారు. కార్లు, ద్విచక్ర వాహనాలు పొలాల్లోనే ఇరుక్కుపోయాయి. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్వే అధికారులు, మండల, గ్రామ సర్వేయర్లు, స్థానిక సర్పంచ్‌లు, సెక్రటరీల సహకారంతో నిర్దేశించిన ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ టీమ్ సభ్యులకు, సర్వేయర్లకు చేసిన ఏర్పాట్లు పెనుగాలులతో నేల పాలయ్యాయి. ఉదయం గుంటూరు కేంద్రంలో ఈ వర్క్ షాపును కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించి ముగిసిన తరువాత సాయంత్రం 4 గంటల సమయంలో నిర్దేశించిన ప్రాంతాలకు చేరుకొనే సమయంలో భారీ పెనుగాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. లేమల్లెపాడు పంచాయతీ సెక్రటరీ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాతూరి కృష్ణా రావు, అలాగే గ్రామ పెద్దలు ఒంగోలు కృష్ణారావు, గద్దె మురళీ, కందిమళ్ళ గోపీ, అన్నంనేని వెంకటరావు, కోసూరి కృష్ణారావు, ఒంగోలు వీర నారాయణ తో పాటు గ్రామస్థులు, యువకులతో పాటు పోలీసులు దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పైన ఉన్న చెట్లను తొలగించారు. నిలిచిపోయిన వాహనాలను పంపించి వేశారు. ఒక్కసారిగా వచ్చిన పెనుగాలికి లేమల్లెపాడు గ్రామంలోని మేత వాములు, పూరిళ్ళు నేల కూలాయి.

అమరావతి కార్మికులకు మెరుగైన వసతులు కల్పించండి

● గుత్తేదారు సంస్థలకు ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్వతి ఆదేశాలు



ఆర్‌వీఆర్ క్యాంపులో కార్మికుల నివాస షెడ్లు పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి గుత్తేదారు సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణాల్లో పని చేయడానికి పొరుగు రాష్ట్రాల నుండి వస్తున్న కార్మికులకు గుత్తేదారు సంస్థలు కల్పిస్తున్న సదుపాయాలను సీఎండీ గురువారం తనిఖీచేశారు. తొలుత తుళ్లూరు ఆర్‌వీఆర్ సంస్థ క్యాంపును ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ కార్మికుల నివాస గృహాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల కల్పన తదితర కనీస వసతులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా అక్కడ మొక్కలు నాటాలని సూచించారు. కార్మికులు ఏ రాష్ట్రాల నుంచి వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్మికుల పిల్లలు సమీప ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాఖమూరులోని ఎన్‌సీసీ కంపెనీ, ఐనవోలులోని ఆర్‌వీఆర్ సంస్థల క్యాంపులనూ సీఎండీ పరిశీలించారు. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. ఏడీసీ అధికారులు టి.మోజెస్ కుమార్, డాక్టర్ కేవీ గణేష్‌బాబు, ఎస్ఈలు శ్రీనివాసరావు, నరసింహారావు, బి.శ్రీధర్, ఎన్ శ్రీధర్ టి.పద్మాకర్, రమేష్ తదితరులున్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

● మంత్రికి నల్లమడ రైతు సంఘ నేతలు వినతి



పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని నాగులపాడులో ఓ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు నల్లమడ రైతు సంఘ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. బర్లీ పొగాకును ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలబడాలని కోరారు. గుంటూరు ఛానెల్‌కు 400 కోట్లు అవసరం కాగా 175కోట్ల కేటాయింపు హర్షించదగ్గ విషయమని, మిగిలిన నిధులు కూడా మంజూరు చేయాలని, భూసేకరణ పనులు ప్రారంభించాలని కోరారు. నల్లమడ ఆధునికీకరణకు సీఎం చంద్రబాబునాయుడు 2016లో హామీ ఇచ్చారని ఆమేరకు 500క్యూసెక్కులు నీరు పారుదలయ్యేలా నల్లమడ వాగు ఆధునికీకరణ చేపట్టి వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. గుంటూరు ఛానెల్ పొడిగింపు కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నల్లమడ రైతులు, మహిళలపై అక్రమ కేసులు బనాయించారని, వాటిని వెంటనే ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్లా రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ, వివేకానంద విగ్రహాల ఏర్పాటుకు వినతి



తహసీల్దారు రాఘవేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మంగళగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ఛత్రపతి శివాజీ మహరాజ్, స్వామి వివేకానందుని విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, ఎంటీఎంసీ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునగాల నాగే శ్వరరావు, నేతలు మునగపాటి వెంకటేశ్వరరావు, కమల కృష్ణ, మొండి వీరబాబు, మల్లేశ్వరరావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో ఆశా వర్కర్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆశా వర్కర్లు

మంగళగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పది రోజులుగా జరుగుతున్న ఆందోళనలకు మద్దతుగా పెదవడ్లపూడి గ్రామంలో ఆశా వర్కర్లు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నేత జీ వాణి మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశా వర్కర్ల ర్యాలీకి వైద్యాధికారి డాక్టర్ ఎం రమేష్, ఏపీ నాన్‌గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కే.శ్రీరాములు, నేతలు పీ.చిన్నలాజర్, టీ.రాణి, ఎ.జయరాజు, బి.రాణి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు



ఎస్సీ బాలుర వసతి గృహంలో దోమలమందు పిచికారీ చేయిస్తున్న తెనాలి యూనిట్ మలేరియా అధికారి పున్నారెడ్డి

దుగ్గిరాల, మే 15 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెనాలి యూనిట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి తెలిపారు. దుగ్గిరాలలోని బీసీ, ఎస్సీ బాలుర, కళాశాల వసతి గృహాల్లో దోమల నివారణకుగానూ, పంచాయతీ, పీహెచ్‌సీ సిబ్బంది సహకారంతో దోమలమందు పిచికారీ చేశారు. పున్నారెడ్డి మాట్లాడుతూ దోమకాటుతో పిల్లలు వ్యాధుల బారిన పడకుండా చేసేందుకు దోమల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మలాథియాన్ మందు పిచికారీ చేయించినట్లు చెప్పారు. పీహెచ్‌సీ సిబ్బంది చంద్రమౌళి, వంకదార సుబ్బారావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరంగా ర్యాలీ

తెనాలి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంపై త్రివిధ దళాలకు మద్దతుగా ఈ నెల 17న పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చినరావూరు పార్కునుంచి సాయంత్రం 4గంటలకు ర్యాలీ ప్రారంభమై బోస్ రోడ్డు, గాంధీచౌక్, మెయిన్‌రోడ్డ్ నుంచి మున్సిపల్ బిల్డింగ్ ఎదురు ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వరకు సాగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొననున్నారు. మాజీ సైనికులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వేలాదిగా జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తమ్ముడు అదృశ్యంపై అన్న ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,మే 15 (ఆంధ్రజ్యోతి): తమ్ముడు కనించడంలేదంటూ అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్వాడి గుడి వీధిలో అనిల్ కుమార్ జైన్ భార్య సంతోషి, తల్లి, ఇద్దరు కుమారులతో కలసి నివసిస్తున్నాడు. గంగానమ్మపేటలోని ఒక బంగారం షాపులో పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అనిల్ భార్య సంతోషి కర్నాటక రాష్ట్రం హుబ్లీలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం అనిల్ ఇంటినుండి బట్టలు సర్దుకొని ఫోన్‌ను ఇంటిలోనే వదలివెళ్లాడు. కుటుంబ సభ్యులు రాత్రి అయినా అనిల్ తిరిగి ఇంటికి రాకపోవడవంతో బంధువులను, స్నేహితులను విచారించిన అచూకీ తెలియలేదు. దీనితో గురువారం అనిల్ సోదరుడు వినోద్‌కుమార్ జైన్ పోలీసులను ఆశ్రయించాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పంట పొలాల్లో అగ్నిప్రమాదాలు

తెనాలి, మారీసుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో పంట పొలాల్లో గురువారం అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తెనాలి అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం రూరల్ మండలం కొలకలూరులో మొక్కజొన్న పైరుకు మంటలు వ్యాపించాయని స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో వెళ్లి 15ఎకరాల్లో మంటలను అదుపు చేశామన్నారు. ఇందులో రూ.50వేలు మేర పంట నష్టం వాటిలిందని తెలిపారు. అదే విధంగా దుగ్గిరాల మండలం పెనుమూలిలో మొక్కజొన్న పైరుకు మంటలు వ్యాపించగా వాటిని సకాలంలో అదుపు చేశామన్నారు. రైతులకు రూ.40వేలు మేర పంట నష్టం వాటిలిందని చెప్పారు. రై తులు సాగుచేసిన పంట పొల్లాల్లో మం టలు పెట్టవద్దని సూచించారు. ఎండ తీవ్రతకు గాలులకు నిప్పురవ్వలు ఇతర పంట పొలాలకు వ్యాపించి పంట నష్టం జరుగుతోందన్నారు.

వార్డుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయండి: హరిప్రసాద్

తెనాలిరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల వారీగా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు కృషి చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ చెప్పారు. గురువారం పట్టణంలోని ఐతానగర్ 39, 40వ వార్డులో వార్డు నూతన కమిటీని వార్డు పార్టీ శ్రేణుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా అన్నం పిన్నారావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు అత్తోట శరత్‌బాబు, మాజీ కౌన్సిలర్ అత్తోట వందనం, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారుడు పెద్దిరాజు సంస్మరణ సభ

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వాంసుడు తాడివలస వెంకట పెద్దిరాజు సంస్మరణ సభ రజకపేటలో గురువారం నిర్వహించారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ, పలు నాటికలకు సంగీతం, దర్శకత్వం వహించి పెద్దల మన్ననలు అందుకున్నారని చెప్పారు. నాగస్వర విద్వాంసులు రమణ, శ్రీనివాస్, రామసుబ్బయ్య, గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కళాకారులు నాదస్వర కచేరీ నిర్వహించారు.



ఏకాంత పూజలందుకుంటున్న భావన్నారాయణ స్వామి

భావన్నారాయణ స్వామికి ఏకాంత పూజలు

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి ఏకాంత సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ధ్వజావరోహణం చేశారు. ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించి ఏకాంత సేవలు ప్రారంభించారు.

భర్త మందలించాడని భార్య అదృశ్యం

తెనాలి మారీసుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడని కుమారుడిని తీసుకుని భార్య అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రామలింగేశ్వర పేటకు చెందిన గవర నాగరాజుకు మూడేళ్ల క్రితం పూర్ణిమతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కాగా ఈ నెల 10న దంపతుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో 11న కుమారుడిని తీసుకుని పూర్ణిమ ఇంటి నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీనిపై భర్త నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

- దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు
- కొన్ని నేల చూపులు, కొన్ని పైకి....
- నిర్వహణ లోపంతో నిరుపయోగం
- దృష్టిసారిస్తేనే దాతలసాయం సద్వినియోగం



బోసురోడ్డులో కొన్ని నేల వైపు, కొన్ని ఆకాశం వైపు చూస్తున్న సీసీ కెమెరాలు



ఐతానగర్ లింగారావు సెంటర్‌లో ఎస్పీ ఆదేశాలతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

తెనాలి, మారీసుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేలాదిగా వచ్చే ప్రజల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నేరనియంత్రణకు ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) నేలచూపులు చూస్తున్నాయి. తెనాలి ప్రాంతంలో 40వార్డులు ఉండగా వేలాది మంది నివసిస్తున్నారు. వర్తక వాణిజ్య వ్యాపార రంగాలకు పెట్టింది పేరుగా తెనాలి పేరుగడించింది. దీనితో ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారిలో దొంగలు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు సంచరించే క్రమంలో నిఘా నేత్రాల ద్వారా పోలీసులు వారి కదలికలను పసికట్టేలా అప్పట్లో తెనాలి పూర్తి స్థాయిలో కెమెరాలను ఏర్పాటు చేసి మునిసిపల్ కార్యాలయం సమీపం నుంచి వీక్షించేలా టీవీలను పోలీసులు ఏర్పాటుచేశారు. కొంత కాలం వాటి సేవలు చక్కగా ఉపయోగపడ్డాయి. కంట్రోల్ రూమ్‌లో టీవీ ద్వారా 40వార్డుల్లో ట్రాఫిక్ జామ్ చిన్నపాటి ఘర్షణలు అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులు తారసపడిన వెంటనే సంబంధిత ఏరియా పోలీసులకు సమాచారమివ్వడంతో తెనాలిలో ఆ ప్రాంతానికి పోలీసులు చేరుకునేవారు. వీటి సేవలు అందుబాటులోకి వచ్చిన కొద్ది నెలలకే పట్టణంలో 70 శాతం మేర నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. సీసీ కెమెరాలు ప్రతిక్షణం కదలికలను గుర్తిస్తున్నాయని ఆనోటా ఈనోటా ప్రచారం జరగడంతో నేరాలకు పాల్పడేలంటే భయపడే స్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మరమ్మతులకు వచ్చిన సీసీ కెమెరాలను సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో ఒక్కొక్కటిగా నిరుపయోగంగా మారాయి. రోజుల తరబడి వాటి నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో ఎండకు ఎండి వానకు నాని వైర్లు సైతం తెగిపోయి పూర్తిస్థాయిలో నిర్వీర్యం అయ్యే పరిస్థితి తలెత్తింది. తదనంతరం సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో కంట్రోల్ రూమ్ కూడా తొలగించారు. ఇటీవల తెనాలిలో అనేక ప్రాంతాల్లో ఇండ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడటం, నడిచి వెళ్లే మహిళల వద్ద బంగారం అపహరించుకుపోవడం, రోడ్లపై మద్యం తాగుతూ పాదచారులపైనే దాడులు చేయడం, అమరావతి ప్లాట్స్, ఐతానగర్, పట్టణ శివారు ప్రాంతాల్లో హత్యలు పట్టణంలో చోటుచేసుకున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులకు పెను సవాలుగా మారింది. అనేక కేసుల్లో విచారణ జాప్యం జరగగా ఇప్పటికి పలు కేసులు మిస్టరీగా మారాయి. పోలీసులు సైతం నేరనియంత్రణను అదుపుచేసేలా సరైన ప్రణాళికలతో ముందుకు వెళ్లకపోవడంతో ఇటీవల జిల్లా ఎస్పీనే నేరుగా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయన సూచనలతో తెనాలిలో సమస్యాత్మక ప్రాంతమైన ఐతానగర్ వంటి పలుప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయించి తిరిగి నిఘానేత్రాల పర్యవేక్షణలో తెనాలిని నిలిపేలా ఆదేశాలిచ్చారు. ఆయన ఆదేశాలతో ప్రస్తుతం పలు ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగిలిన మిగిలిన వాటిల్లో కూడా కెమరాలను ఏర్పాటుచేస్తే నేరాల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పట్టి పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



డీఎస్పీకి కెమెరాల ఏర్పాటుపై ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్ (ఫైల్)

తెనాలిపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

గత ఐదేళ్లగా తెనాలిలో పేట్రేగిన రౌడీయిజాన్ని అదుపు చేసేందుకు నేరుగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ రంగంలోకి దిగారు. గతవారం ఎస్పీ సతీష్‌కుమార్ తెనాలి పట్టణంలోని రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదంటూ హెచ్చరికలు జారీచేశారు. రాత్రి గం.9ల తరువాత ఇళ్ల నుంచి బయటకు ఎవరూ వెళ్లవద్దంటూ ఆదేశాలు ఇచ్చారు. సీసీ కెమెరాలు సైతం వార్డుల్లో ఏర్పాటుచేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. తెనాలి సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ వంటివారు ఉన్నప్పటికీ ఎస్పీ స్థాయి అధికారి తెనాలిలో నేరుగా రౌడీషీటర్ల ఇళ్లకువెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి పరిణామాలు చూస్తే ఐదేళ్లల్లో తెనాలి ప్రాంతంలో నేరాలు ఏవిధంగా జరిగి రౌడీయిజం పెరిగిందో ఇట్టే అర్థమౌతుంది. ఎస్పీ సతీష్‌కుమార్ చొరవతో రాబోయో అతిసల్ప కాలంలోనే పట్టణంలో నేరాలు తగ్గి ప్రశాంత తెనాలిగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన చైర్‌పర్సన్, కమిషనర్



అధికారులకు సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ జయపాల్ తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేటలోని 29వ వార్డులో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న వేర్వేరుగా అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వేగవంతంగా తెనాలి పట్టణం అభివృద్ధి చెందుతోందని అన్నారు. ముఖ్యంగా చెంచుపేట రావి టవర్స్ నుంచి మార్కెట్ యార్డు వరకు ఉన్న డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టామని రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించామన్నారు. భావితరాలకు అభివృద్ధి చెందిన పట్టణంగా తెనాలిని అభివృద్ధిచేసి అందిద్దామన్నారు. దానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. డ్రెయిన్లను ప్రజలు ఆక్రమించరాదన్నారు. అనంతరం 30, 31వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురువారం స్థానిక చెంచుపేటలోని కోనేరు బజార్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వార్డుల ప్రజలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక నందులపేట కవిరాజా పార్కు రోడ్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె జయపాల్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న తదితరులు

వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ములకా శివసాంబిరెడ్డి

తెనాలిరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్రప్రభుత్వం పథకం ప్రకారమే కుదేళు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. మండలంలోని కొలకలూరులో గురువారం రైతులను కలుసుకుని దేశ వ్యాప్తి సమ్మెకు మద్దతు తెలిపి పాల్గొనాలనికోరారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యం పెసర, మిర్చి పొగాకు, జొన్న తదితర పంటల ధరలు పడిపోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. పెసర, మినుములు, జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో నే రైతాంగం దళారులకు అమ్ముకునే పరిస్థితి నెలకొందని ఆక్షేపించారు. గత ఎన్నికల సందర్భంగా నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా 200 బహిరంగ సభల్లో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ ఎంఎస్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రచారం చేశారని , గెలిచిన తరువాత అమలు చేయడం సాధ్యంకాదని చేతులెత్తేసిన ఘనుడు మోడీ అని తీవ్రంగా విమర్శించారు. రైతు,కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాపిత సమ్మెలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పలువురు రైతు సంఘం నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలపాలని రైతులను కోరుతున్న శివసాంబిరెడ్డి

కార్మికుల సంక్షేమం కోసమే సార్వత్రిక సమ్మె

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కార్మికుల సంక్షేమం కోసమే సార్వత్రిక సమ్మె జరుగుతుందని సీఐటీయూ జిల్లా నాయకుడు కె.బాబుప్రసాద్ చెప్పారు. పట్టణంలోని మారీసుపేట మస్టర్ పాయింట్‌లో గురువారం పారిశుధ్య కార్మికులతో సమ్మె సమాయత్తంపై మాట్లాడారు. కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా సమ్మెలో పాల్గొనాలని, ప్రజలందరూ మద్దతుపొందేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పద్మ, దుర్గాప్రసాద్, రోహిణి, గోపి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు బాబుప్రసాద్

వేసవి తీవ్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వైద్యాధికారి సుమంత్



వైద్యపరీక్షలు చేస్తున్న మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతపై ప్రజలు తగిన జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు సుగాలికాలనీలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా తీసుకోవడం మంచిదన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోకూడదన్నారు. వాంతులు, తలతిరటం వంటి సమస్యలు వస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. గర్భిణీలు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. వేసవిలో చాలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కుమారి, ఏఎన్ఎమ్ వసుమతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌తో శరవేగంగా తెనాలి ప్రాంత అభివృద్ధి

- వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం

తెనాలి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కుంటుబడిన తెనాలి ప్రాంతం కూటమి ప్రభుత్వంలో మంత్రి మనోహర్ రాకతో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు అన్నారు. గురువారం మండలంలోని అంగలకుదురులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ఎందరో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతే మరికొందరు క్షతగాత్రులుగా మిగిలారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై దృష్టిపెట్టి నూతన రోడ్లు వేయించిందన్నారు. అధ్వానంగా ఉన్న తెనాలి - అంగలకుదురు - నారాకోడూరు రోడ్డును మంత్రి మనోహర్ ప్రత్యేక చొరవతో నూతన రోడ్డు వేయించారని వాహనదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెనాలి మార్కెట్ రోడ్డు నుంచి బుర్రిపాలెం రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్ల వెడల్పుపనులు చేపట్టారన్నారు. తెనాలి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి మనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముప్పవరపు సాంబశివరావు, గొల్లపూడి సాయిగిరి, ముక్కామల సుబ్బయ్య, ఎల్ఐసీ శ్రీను, చెరుకూరు శ్రీను, పాలడుగు నాగయ్య, పేరం నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమానికి విరాళం అందజేస్తున్న దాత బాపూజీ

వృద్ధాశ్రమానికి రూ.51,116 విరాళం

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి దాత మునగాల బాపూజీ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.51,116లు విరాళం అందజేశారు. వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం సొంత భవనం సమకూర్చుకుందని, ఇందుకు దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి దాతలు ముందుకు రావాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో తోటి వారికి సాయపడాలని కోరారు.

బంగారు ఆభరణాలు తయారు చేస్తానంటూ మోసం

- సుమారు రూ.50లక్షలు నష్టపోయానని బాధితుడి ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,మే 15 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు తయారు చేయిస్తానంటూ నమ్మబలికి మోసంచేసిన ఘటనపై టూటౌన్ పోలీసులుకు ఫిర్యాదు అందింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్ ఈటీ కాలనీకి చెందిన సంకా రాజప్రకాశరావు తెనాలి పట్టణంలో బంగారం షాపును నిర్వహిస్తున్నాడు. పట్టణానికి చెందిన కొల్లూరు ఉదయ్ వెంకటేశ్వరావు కూడా బంగారం షాపు ఉంది. ఇద్దరి మధ్య వ్యాపార లావాదేవీలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో రాజప్రకాశరావు కొల్లూరు ఉదయ్ వెంకటేశ్వారావుకు 735గ్రాముల మేలిమి బంగారం విలువ సుమారు 65లక్షలు వ్యాపారం నిమిత్తం ఇచ్చాడు. అందులో రూ.15లక్షలు జమచేయగా ఇంకా రూ.50 లక్షలు రావాల్సి ఉంది. తన బంగారాన్ని ఇవ్వాలని ఉదయ్ వెంకటేశ్వరావుని ప్రకాశరావు పలుమార్లు కోరగా ఇస్తానని చెప్పి, పట్టణం వదలి పారిపోయాడు. ఇదేవిధంగా పలువురిని ఉదయ్ వెంకటేశ్వరావు మోసం చేశాడన్నారు. వ్యాపారి రాజప్రకాశరావు గురువారం టూటౌన్ పోలీసులును ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.



వీరయ్యచౌదరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నంద్రకుమార్

వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తా

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబం నుంచి వచ్చిన తన తండ్రి వీరయ్యచౌదరి అకుంఠిత దీక్షతో అంచెలంచెలుగా రాష్ట్ర మంత్రిస్థాయికి ఎదిగారని, ఆయన విలువలు, ఆశయాలను కొనసాగిస్తానని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో మాజీ మంత్రి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ ధూళిపాళ్ల వీరయ్యచౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల తన తండ్రి వీరయ్యచౌదరి విగ్రహాన్ని అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అశేష ఆదరాభిమానాలను తమ తండ్రి ధూళిపాళ్ల వీరయ్యచౌదరి వారసత్వంగా అందించారన్నారు. సంగం డెయిరీని స్థాపించి పాల రైతుల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపారన్నారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మరణించిన పాడి రైతు కొల్లా సురేంద్రబాబు కుటుంబ సభ్యులకు పాలరైతు సంక్షేమ నిధి నుంచి రూ.30,000 నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, మాజీ మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మృతుడుకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మృతులకు టీడీపీ నేతల నివాళి

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మొవ్వా వెంకటేశ్వరరావు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే జడవల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు పిల్లి శారమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. శారమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఫోన్లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, ఎల్లంశెట్టి సీతారామయ్య, మధు, ఉన్నంగి సుబ్బారెడ్డి, మహంకాళేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక రుగ్మతలు దూరం

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం అందించడం వలన శారీరక రుగ్మతలను దూరంచేయవచ్చునని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ యూ పద్మజ అన్నారు. గురువారం పట్టణంలోని 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ సంసిద్ధతపై అవగాహన కార్యక్రమం జరిగింది. వివిధ రకాల కూరగాయలతో తయారుచేసిన ఆహార పదార్థాల వలన కలిగే పోషకాల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రా ల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్య గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రధం కోఆర్డినేటర్ స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.